నిండుకుండలా చలివాగు

- ఎమ్మెల్యే చొరవతో పంటలకు సాగునీరు
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు


నీటితో నిండి ఉన్న చలివాగు

చిట్యాల: మండలంలోని నవాబుపేట గ్రామ శివారు చలివాగుపై నిర్మించిన చెక్‌డ్యాం నిండు కుండాలా మారింది. దీంతో యాసంగి పంటలకు నీరు అందుతోంది. ఎండాకాలం వచ్చిన పంటలకు సరిపడా చలివాగులో నీరు నిల్వ ఉండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చలివాగు పరివాహక ప్రాంతాల్లో వేసిన పంట పొలాలు ఎండిపోయే ప్రమాదం ఉందని ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు ఇటీవల ఈ ప్రాంత రైతులు విన్నవించుకున్నారు. దీంతో కరీంనగర్ జిల్లా ఎస్సారెస్పీ సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడి సాగునీరు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు అధికారులు కరీంనగర్ జిల్లా నుంచి ఎస్సారెస్పీ డీబీఎం–18 కాల్వ ద్వారా హుజూరాబాద్ మీదుగా వేములపల్లి, మొగుళ్లపల్లి చలివాగు నుంచి నవాబుపేట చలివాగులోకి నీటిని విడుదల చేశారు. అలాగే చెక్‌డ్యాం నిర్మాణం మూలంగా బ్యాక్ వాటర్ చిట్యాల గ్రామ శివారు వరకు చేరుకుంది. దీంతో చలివాగు నవాబుపేట చెక్‌డ్యాం ఎగువ భాగం 2కిలో మీటర్ల పొడవునా నిండుకుండలా కనిపిస్తోంది. దీంతో మండలంలోని ఏలేటిరామయ్యపల్లి, నవాబుపేట, చిట్యాలతో పాటు మొగుళ్లపల్లి మండలంలోని బద్దంపల్లి, కొర్కిశాల, అంకుషాపురం రైతులకు యాసంగికి సాగు నీరుకు ఢోకా లేదు. రెండేళ్ల క్రితం నిర్మించిన చెక్‌డ్యాం ఏర్పాటుతో నిలిచిన సాగు నీరుతో పంట పొలాలు పచ్చదనంతో వెల్లువిరుస్తున్నాయి. ఈ ప్రాంత ఆయకట్టు సుమారు వెయ్యి ఎకరాలకు పైగా సాగు నీరు అందుతోంది. చలివాగులోని నీటిని విడుదల చేసేందుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు రైతులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.


చలివాగు పక్కన పొలాలు

ప్రతీ ఎకరాకు సాగునీరు



రైతులు సాగు చేస్తున్న ప్రతీ ఎకరాకు నీరు అందిస్తా. చెక్‌డ్యాంలు నింపేందుకు అవసరమైతే మంత్రులు, ముఖ్యమంత్రితో మాట్లాడుతా. చివరి ఆయకట్టు వరకు సాగునీటిని అందించడమే లక్ష్యం. డీబీఎం–38 కాల్వలో పిచ్చి మొక్కలను తొలగించుకుంటుకు రూ.35లక్షలు నిధులు కేటాయించి పనులు చేయిస్తున్నా.

– గండ్ర సత్యనారాయణరావు, ఎమ్మెల్యే

11 ఎకరాలు సాగు చేస్తున్నా..



నవాబుపేట చలివాగు పక్కన 11 ఎకరాలు వరిపంట సాగు చేస్తున్నా. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో వేసిన పంట చేతికి వస్తుందో రాదో అని భయపడ్డా. ఎమ్మెల్యే సత్యనారాయణరావు ప్రత్యేక చొరవతో చెక్‌డ్యాంలోకి సాగునీరు విడుదల చేయించారు. దీంతో పంటలకు సరిపడా నీరు అందుతున్నాయి.

– పింగిలి సతీశ్‌రెడ్డి, రైతు నవాబుపేట

ఉద్యోగులకు పదవీ విరమణ సహజం

- ఎంపీడీఓ బాబు


హుస్సేన్ దంపతులను సన్మానిస్తున్న నాయకులు

కాటారం: ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ సహజమని ఎంపీడీఓ బాబు, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య అన్నారు. మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా పని చేసిన హుస్సేన్ పదవీ విరమణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. హుస్సేన్ దంపతులను అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పూలమాల, శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ వీరస్వామి, మాజీ ఉపసర్పంచ్ నాయిని శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

కరెంట్ తీగలు అమర్చితే చర్యలు

- పస్రా ఎస్సై కమలాకర్


మాట్లాడుతున్న ఎస్సై కమలాకర్

గోవిందరావుపేట : చెరువులో, పంట పొలాల్లో, అడవుల్లో కరెంట్ తీగలు అమర్చి మనుషులకు ప్రమాదాలు కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు అని పస్రా ఎస్సై అచ్చ కమలాకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని దుంపెల్లిగూడెం, రంగాపూర్ గ్రామాల్లోని పాత నేరస్తుల ఇళ్లలో ఎస్సై తన సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చెరువుల్లో చేపలు పట్టేటప్పుడు నీటిలో కరెంట్ వైర్లు పెట్టకూడదని, కొందరు తమ పంట పొలాలకు రక్షణ నిమిత్తం, మరికొంత మంది వన్యప్రాణులను వేటాడుట కోసం కరెంట్ తీగలు, ఉచ్చులు అమర్చుతున్నారన్నారు. వీటితో మనుషుల ప్రాణాలు పోయే ప్రమాదం ఉందన్నారు. దీనికోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

'ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి'

ఏటూరునాగారం : ఎస్సీల వర్గీకరణ చేపట్టాలని మాదిగ జాతీయ సీనియర్ నాయకులు ఇరుగుపైడి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మాదిగ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీల ఏ,బీ,సీ, డీ వర్గీకరణ అమలు చేయాలన్నారు. ఇందులో భాగంగానే ఈనెల 4న ములుగు జిల్లా కేంద్రానికి ఎమ్మార్పీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిక వస్తున్నారన్నారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మడిపల్లి శ్యాంబాబు, నెమలి నర్సయ్య, వావిలాల స్వామి, గజ్జల ప్రసాద్, లంజపల్లి రాము, కల్లెపల్లి రమేష్, ఎంపెల్లి శంకర్, గుగ్గిళ్ల సురేష్, పడిదల సతీష్, ఆత్కూరి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రారంభానికి నోచుకోని ఆస్పత్రి భవనాలు



టేకుమట్ల: మండలంలో నిర్మించిన పల్లె దవాఖాన భవనాలు ప్రారంభానికి నోచుకోవడం లేదని సీపీఐఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారపల్లి మల్లేశ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని నిర్మాణం పూర్తయినా ప్రారంభించని పల్లె దవాఖాన భవనాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వాలు పేద గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు అందించడం కోసం పల్లె దవాఖానాను రూ.20 లక్షలతో నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. మండల కేంద్రంతో పాటు గర్మిళ్లపల్లి, వెలిశాల గ్రామాల్లో భవన నిర్మాణాలు పూర్తయిన నేటికి ప్రారంభించలేదన్నారు. దీంతో అద్దె భవనాల్లోనే అరకొర వసతులతో వైద్య సేవలు నిర్వహిస్తున్నారన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాంట్రాక్టర్‌కు పెండింగ్ బిల్లులు చెల్లించి, పల్లె దవాఖానాలను ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు.

108లో మహిళ ప్రసవం

వెంకటాపురం(కె) : మండల పరిధిలోని శాంతినగర్ గ్రామానికి చెందిన మహిళ 108 వాహనంలో ప్రసవించిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. శాంతినగర్‌కు చెందిన సునీత శుక్రవారం ఉదయం నుంచి పురిటినొప్పులతో బాధపడుతుందని తెలిపారు. గమనించిన కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. సునీతను వాహనంలో వెంకటాపురం వైద్యశాలకు తరలిస్తుండగా నొప్పులు ఎక్కువ కావడంతో ఈఎంటీ రాజ్యలక్ష్మి, పైలెట్ కుమార్‌లు ఆమెకు వైద్య సేవలు అందించగా రెండో కాన్పులో బాబుకు జన్మనిచ్చింది.

'బీఆర్‌ఎస్ పార్టీ శ్రీరామరక్ష'

మంగపేట : తెలంగాణ ప్రజలకు బీఆర్‌ఎస్ పార్టీ శ్రీరామరక్ష అని పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు అన్నారు. శుక్రవారం మండలంలోని తిమ్మంపేటలో పార్టీ కార్యకర్తల సమావేశం మండల పార్టీ అధ్యక్షుడు కుదుముల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జరిగింది. సమావేశానికి లక్ష్మణ్‌బాబు హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను ఇబ్బంది పెడుతున్నారన్నారు. వారు నెరవేర్చని హామీలను ఎండగడుతూ ప్రజలకు దగ్గరగా ఉండాలని నాయకులు, కార్యకర్తలను కోరారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, ప్రదీప్‌రావు, కృష్ణ, రాజు, నరేందర్, ధనలక్ష్మీ, నాగ రమేష్, శ్రీహరి, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఏఎన్‌ఎం మృతి


సురేఖ (ఫైల్)

గోవిందరావుపేట : మండలంలోని పస్రా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్‌ఎంగా విధులు నిర్వర్తిస్తున్న కె.సురేఖ(44) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందింది. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గొంది రాజేశ్ సురేఖ కుటుంబాన్ని పరామర్శించి మాట్లాడుతూ 17 ఏళ్లుగా పీహెచ్‌సీలో సేవలందించారని, ఏజెన్సీ ప్రాంతంలో కూడా వైద్యసేవలు అందించారని అన్నారు. సురేఖ మృతితో ఆమె కుటుంబం దిక్కుతోచని స్థితి లో ఉందన్నారు. మృతురాలి కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, అలాగే ఆ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అందజేత


సెల్‌ఫోన్లు అందజేస్తున్న ఎస్సై అభినవ్

కాటారం: మండలంలో పలు చోట్ల పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను ఎస్సై మ్యాక అభినవ్ ఆధ్వర్యంలో పోలీసులు ఛేదించి తిరిగి బాధితులకు శుక్రవారం అందజేశారు. వివరాల్లోకి వెళ్తే.. కేసముద్రానికి చెందిన జీవన్, కాటారం మండలం కొత్తపల్లికి చెందిన దిలిప్, ధన్వాడకు చెందిన శివాని, గంగారానికి చెందిన బండం వసంతరెడ్డి, మంథని మండలం ఆరేందకు చెందిన సందీప్ ఇటీవల మండల పరిధిలో సెల్‌ఫోన్లను పోగొట్టుకున్నారు. ఈ మేరకు బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, సీఈఐఆర్ పోర్టల్‌లో ద్వారా సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులకు పోలీస్ స్టేషన్‌లో ఎస్సై అభినవ్ అప్పగించారు. కానిస్టేబుళ్లు గణేశ్, రమేశ్ పాల్గొన్నారు.

మిర్చికి గిట్టుబాటు ధర చెల్లించాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రవికుమార్


మిర్చిని పరిశీలిస్తున్న నాయకులు

ఏటూరునాగారం: జిల్లాలోని రైతులు పండించిన మిర్చి పంటకు క్వింటాకు రూ.25వేలు చెల్లించి కొనుగోలు చేయాలని ప్రభుత్వ సంస్థలు అయిన మార్క్‌ఫెడ్, నాఫెడ్ సంస్థలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బండారు రవికుమార్, రాష్ట్ర కమిటీ సభ్యుడు సూడి కృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ అన్నారు. శుక్రవారం మండలంలోని రామన్నగూడెం మిర్చి రైతులు, కల్లాలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలో 25 వేల ఎకరా ల్లో మిర్చి సాగు అవుతుందని, రెండు సంవత్సరాలు నుంచి మిర్చి రైతులు గిట్టుబాటు ధర లేక ఆత్మహత్యలు చేసుకోవాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. వరంగల్, ఖమ్మం మార్కెట్లో క్వింటాకు రూ.12వేల నుంచి రూ.13వేల వరకు పలుకుతుందన్నారు. దీంతో పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదన్నారు. ఏటూరునాగారం కేంద్రంగా కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు తుమ్మల వెంకట్ రెడ్డి, ఎండీ దావూద్, పొదిల్ల చిట్టిబాబు, జిల్లా కమిటీ సభ్యులు ఎండీ గఫూర్‌పాషా, తీగల ఆగిరెడ్డి, జగటి చిన్న, తోకల రవి, ధనుష్, బాలు రైతులు బండారి నరసింహులు ,నూతక్కి రాంబాబు, గుండపు నాగులు, ఇర్సవడ్ల భాస్కర్, బండారి రంజిత్, గార రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నారైల దాతృత్వం

గణపురం: మండలంలోని కర్కపల్లికి చెందిన డాకూరి కృష్ణారెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. కాగా, వైద్య ఖర్చులకు రూ.5 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. దీంతో మాజీ సర్పంచ్ పెంచాల సౌమ్య– రవీందర్ దంపతుల కుమారుడు చరణ్‌రాజ్, కుమార్తె తేజ్ ఎన్నారైలు బాధితుడికి రూ.50 వేల ఆర్థికసాయం అందజేసి దాతృత్వం చాటుకున్నారు. ఈమేరకు ఆర్థిక సాయాన్ని రవీందర్–సౌమ్య బాధిత కుటుంబ సభ్యులకు శుక్రవారం అందించారు.

సైన్స్‌పై మక్కువ పెంచుకోవాలి


కాటారం: సైన్స్‌పై అవగాహన కల్పిస్తున్న ప్రొఫెసర్లు, అధ్యాపకులు


చిట్యాల: సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఉపాధ్యాయులు

- సైన్స్ అకాడమీ ప్రొఫెసర్లు రవీందర్, కిషన్

కాటారం: ప్రతీ వ్యక్తి జీవితంలో సైన్స్ ప్రాముఖ్యత ఎనలేనిది విద్యార్థులు సైన్స్‌పై మక్కువ పెంచుకోవాలని తెలంగాణ సైన్స్ అకాడమీ ఆఫ్ జాయింట్ సెక్రటరీ ప్రొఫెసర్ రవీందర్, జోనల్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ కిషన్ అన్నారు. కాటారం మండలంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం జాతీయ విజ్ఞాన శాస్త్ర దినోత్సవం నిర్వహించారు. పరిసరాల పరిరక్షణకు భారత యువత చేయాల్సిన కార్యచరణపై విద్యార్థులకు ప్రొఫెసర్లు దిశానిర్దేశం చేశారు. విద్యార్థులు తయారు చేసిన సాంకేతిక పరికరాల ప్రాజెక్టులను తిలకించి అభినందించారు. ఈ కార్యక్రమంలో వాగ్దేవి ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్ రాధాకిషన్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజ్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఆదర్శ సైన్స్ ఎక్స్‌పో

జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని ఆదర్శ హై స్కూల్‌లో నిర్వహించిన సైన్స్ ఎక్స్‌పో–2025 ఆకట్టుకుంది. విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనలను పలువురు మెచ్చుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ జనగామ కరుణాకర్‌రావు మాట్లాడుతూ.. విద్యార్థి స్థాయి నుంచే ప్రతి ఒక్కరూ శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ జనగామ కార్తీక్‌రావు, ప్రిన్సిపాల్ జనగామ కృషిత, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేజీబీవీలో..

మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన సైన్స్ ల్యాబ్‌ను పాఠశాల ప్రత్యేకాధికారిణి చల్ల సునీత ప్రారంభించారు. విద్యార్థులు పలు ప్రయోగాలను తయారు చేసి ప్రదర్శించారు. అనంతరం విద్యార్థులకు సైన్స్‌పై క్విజ్, డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయునులు విజయ, నళిని, అరుణ, మణిమాల, సుజాత, శిరీష, సరిత, విద్యార్థులు పాల్గొన్నారు.


కాళేశ్వరం: సీవీ రామన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

మల్హర్: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని తాడిచర్ల జిల్లాపరిషత్ పాఠశాలలో శుక్రవారం సైన్స్ ఉపాధ్యాయులు కుమారస్వామి, శ్రీనివాస్, శ్రీనివాస్ ఆధ్వర్యంలో క్విజ్, ఉపన్యాస పోటీలను నిర్వహించారు. గెలుపొందిన 20 మంది విజేతలకు మోమెంటోలు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు తిరుపతి, ఉపాధ్యాయులు జయభాస్కర్, జగన్‌నాయక్, శివలింగం, స్వర్ణలత, పూర్ణచందర్, సరస్వతి, శ్రీధర్, రాజేందర్, మహేష్, వినోద్ కుమార్ పాల్గొన్నారు.

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, జిల్లాపరిషత్ బాలికల పాఠశాలలో ఘనంగా సైన్స్‌డేను నిర్వహించారు. శుక్రవారం ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, ప్రధానోపాధ్యాయురాలు సరిత డాక్టర్ సీవీ రామన్ గురించి విద్యార్థులకు వివరించారు.

చిట్యాల: మండలంలోని ఉన్నత పాఠశాల, కాకతీయ హైస్కూల్ తదితర పాఠశాలలో సైన్స్ దినోత్సవ వేడుకలు శుక్రవారం ఎంఈఓ కొడెపాక రఘుపతి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు శ్రీరాం రఘుపతి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, సరళదేవి, రాజమౌళి, నీలిమా రెడ్డి, కాకతీయహైస్కూల్ కర్పండెంట్ రాజ్‌మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.


మహదేవపూర్ డిగ్రీ కాలేజీలో..


రేగొండలో..

రేగొండ: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్ సీవీ రామన్ చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం క్విజ్ పోటీలు, వ్యాస రచన పోటీలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రజిన్ కుమార్, ఉపాధ్యాయులు తిరుపతి, శ్రీనివాస్, రవీందర్, మాలత, శశాంక, శిరోమణి తదితరులు పాల్గొన్నారు.


కాటారం: కేజీబీవీలో సైన్స్ డే వేడుకలు


కాటారం: ప్రయోగాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు


మల్హర్: విద్యార్థులకు బహుమతి ఇస్తున్న సైన్స్ ఉపాధ్యాయుడు కుమారస్వామి

వనరులు సరే.. వసతులేవి ?

- రోడ్లపైనే సంత నిర్వహణ
- అభివృద్ధి చేయని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు


రోడ్డుపైనే సంత నిర్వహిస్తున్న వ్యాపారులు

వెంకటాపురం(కె) : మండల కేంద్రంలో ప్రతి మంగళవారం సంత నిర్వహిస్తారు. సంత నిర్వహించేందుకు వనరులు ఉన్నా వసతులు మాత్రం లేవు. దీంతో రోడ్లపైనే సంత నిర్వహించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంత ద్వారా గ్రామ పంచాయతీకి ఏడాదికి సుమారు రూ.లక్ష ఆదాయం వస్తోంది. కానీ సంతను మాత్రం అధికారులు అభివృద్ధి చేయడం లేదు. మండలంలోని గిరిజనులు, గిరిజనేతరులు, గ్రామాల్లో చిల్లర దుకాణాలు నడిపే వారు అధిక సంఖ్యలో వచ్చి సంతలో సరుకులు కొనుగోలు చేస్తారు. అటవీ ఉత్పత్తులైన చీపుర్లు ఇతర వస్తువులను గిరిజనులు ఇక్కడే అమ్ముకుని తమకు కావల్సిన వస్తువులను కొనుగోలు చేస్తుంటారు. పొలాల్లో పండిన చిరుధాన్యాలను రైతులు సైతం సంతలో అమ్ముకుంటారు. ప్రతీవారం జరిగే ఈ సంతలో సుమారు రూ. 3 లక్షల నుంచి రూ. 4 లక్షల వరకు వ్యాపారం సాగుతోంది.

వర్షాకాలంలో ఇబ్బందులు

సంత బస్టాండ్ సెంటర్‌లో ప్రధాన రహదారిపై ఉండటంతో అటు ప్రజలు ఇటు వ్యాపారులు అవస్థలు పడుతూ అసౌకర్యానికి గురవుతున్నారు. వ్యాపారులు ఎప్పటికీ చిన్న చిన్న టెంట్లు వేసుకొని వస్తువులను విక్రయాలు జరుపుతుంటారు. వర్షాకాలం వీరి బాధలు వర్ణతీతంగా ఉంటాయి. సంతకు ప్రత్యేక స్థలం కేటాయించి అక్కడే షెడ్లు నిర్మించాలని, సెడ్ల నిర్మాణం చేపడితే వ్యాపారులు అడ్వాన్సుల రూపంలో చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. అధికారులు స్పందించి సంతకు ప్రత్యేక స్థలం కేటాయించి షెడ్లు నిర్మించాలని వ్యాపారులు కోరుతున్నారు.

సంతకు స్థలం కేటాయించాలి



మండల కేంద్రంలో నిర్వహించే వార సంతకు పంచాయతీ అధి కారులు ప్రత్యే స్థలం కేటాయించాలి. రోడ్లపై సంత నిర్వహించడం వల్ల వాహనదారులకు, ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

– ప్రసాద్, వెంకటాపురం

రోడ్లపై షాపులతో ఇబ్బందులు



రోడ్డు పక్కన షాపులు ఏర్పాటు చేయడంతో వివిధ పనులపై వచ్చే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు రోడ్డు పక్కన షాపులను తొలగించేలా చర్యలు చేపట్టాలి.

– జక్కుల రమేశ్, వెంకటాపురం

గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



కాటారం: మండల కేంద్రంలోని కేంబ్రిడ్జి హై స్కూల్‌లో శుక్రవారం చిన్నారుల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు అలరించాయి. ఎల్‌కేజీ, యూకేజీ పూర్తి చేసుకున్న చిన్నారులకు మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య చేతుల మీదుగా సర్టిఫికెట్లు బహూకరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ అన్నమనేని సాయివాణి, ప్రిన్సిపాల్ అన్నమనేని పృథ్వీధర్‌రావు, వ్యవస్థాపకులు తాటి శ్రీనివాస్‌గౌడ్, ట్రస్మా జిల్లా సెక్రటరీ సంపత్‌రావు, ఆదర్శనగర్ కాలనీ కన్వీనర్ ఆత్మకూరి కుమార్‌యాదవ్, బీరెల్లి మహేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.